# ఫోటో

తొమ్మిదేళ్ళు కూడా నిండని కూతురు వేసిన ప్రశ్నకి ఎలా జవాబు చెప్పాలో తెలీలేదు సుశీలకి, ముందు తడబడింది, తర్వాత ఆలోచించింది. ఆడటం అనువైన అబద్ధం కూడా దొరకలేదు ఏం చెప్పాలి ఎలా చెప్పాలిఅని కంగారుపడింది. అంత చిన్నపిల్లకి సమాధానం చెప్పేదేమిటని మనసు మొరాయించింది. ఆ మాట దాటించేద్దామని చూసింది. కాని మళ్ళీ అంతలోనే -.

"ఏమే అమ్మా ! నాన్నగారెందుకమ్మా రారే స్కూటరు ?" అంది కిరణ్.

"ఎందుకో అందుకు. విసిగించక అవతలికెళ్ళు" అంది సుశీల మెత్తగా వూరుకుంటే కూతురు మాటవినదని.

ఊఁ....ఊఁ.... చెప్పాల్సిందే - చెప్పు, చక్కగా యిప్పుడే కనుకవుంటే హాయిగా నేనూ, తమ్ముడూ చెల్లాయీ నాన్నగారితో కలిసి స్కూటరెక్కి స్కూలు దగ్గర దిగిపోయే వాళ్ళం - చెప్పవే -, అసలెందుకమ్మా రారు" అంటూ సుశీల మెడపక్కకి తిప్పేసి, తన రెండుచేతులతో తల్లిముఖం తన వైపుకు తిప్పుకుని గొడవ మొదలు పెట్టింది కిరణ్,

"ఏదో డబ్బు అవసరం వచ్చి అమ్మేశారు" అంది సుశీల. అబద్ధం అంకిళ్ళలో ఆగి ఆగి బయటపడింది.

"మరే పాపం! నీకూ నాన్నగారికేం పనిలేదు. అస్తమానం డబ్బూ డబ్బూ -, ఛీ! ఎప్పుడూ ఇంతే" అంది ఆరిందాలా విసుక్కుంటూ, అంతవరకు వాళ్ళిద్దరి మాటలు వింటున్న ఏడేళ్ళ మురళి "అస్సలు నాన్నగారికీ, అమ్మకి బుద్ధిలేదు" అన్నాడు.

వాడంత మాటనేసరికి సుశీలకి చర్రున కోపం వచ్చింది. "చెస్, వెధవా - నోర్మూయ్, వెధవ్వాగుడూ నువ్వూను" అంటూ చెయ్యెత్తింది. మురళి చటుక్కున తప్పుకున్నాడు.

"అవున్లే మాది వాగుడే నీది మాత్రం కాదు పాపం, అసలు నీ కంతా కుళ్ళే. నాకు తెలీదేవిటి? ఇప్పుడు స్కూటరువుంటే మే మెక్కడ దానిమీద స్కూలుకెళ్తామో అనీ - కుళ్ళుతో నాన్నగారిని అమ్మేయమన్నావు. అస్సలు నీతో మాట్లాడకూడదు" అంటూ యింకా ఏదో సణుగుతూ, కాళ్ళు తపతప కొట్టుకుంటూ వెళ్ళిపోయింది కిరణ్.

ఒలిచిన బంగాళాదుంపలు గిన్నెలో పోసి, తుక్కు బయటపారబోయటానికి వెళ్ళి వస్తూ మంచంమీద చెల్లా చెదరుగా పడివున్న ఫొటోలని. ఆల్బమ్‌ని చూసి, చేతులు తుడుచుకుని వాటి నొక్కొక్కటి జాగ్రత్తగా బొత్తు పెట్ట బోయింది.

కొన్ని పాటలువింటే కొన్ని పాతరోజులు గుర్తుకొస్తాయి. కొన్ని వాసనలు చూస్తే ఎన్నో స్మృతులు మనసుని కలచివేస్తాయి. కొన్ని గాలులు వీస్తే, ఎన్నో భయాలు చుట్టుముట్టుతాయి. కొన్నేళ్ళనాటి ఫొటోలు చూస్తే అప్పటి అమాయకత్వం, బ్రతుకులోని ఉత్సాహం బరువు బాధ్యతలు తెలీని ఊహాలోకం, అందులో విహరించే 'మనం' గుర్తుకొస్తాయి.

ఆల్బమ్‌లో అతికించిన ఫొటోలు ఎన్నో వూడిపోయాయి. వాటిని బొత్తి పెడదామని ఒక్కొక్కటే చూస్తూ వుండిపోయింది సుశీల.

అది తనూ ఆయనా పెళ్ళయిన రెండోరోజునే స్టూడియోకి వెళ్ళి తీయించుకున్న ఫొటో. అక్కడక్కడ మరకలు పడి వుంది. ఆ రోజు తామిద్దరూ అలా ధైర్యంగా వెళ్ళి ఫొటో తీయించుకున్నందుకు ఎంతమంది బుగ్గలు నొక్కుకున్నారు. చివరికి అన్నయ్యకూడా విమర్శించాడు.

“ఎలాగూ పెళ్ళి అయింది కదా, ఈ రోజునుంచే వూరేగాలా ఏవిటి” అంటూ విసుక్కున్నాడు.

“ఆఁ.... అంతా మీలాగే, అచ్చటా ముచ్చటా లేకుండా ప్రతిదానికీ మా అమ్మ' మా నాన్న, మా చెల్లెలు అంటూ, కూర్చుంటారేవిటి ? దేనికైనా ధైర్యం వుండాలి. మన పెళ్ళిలో ఫొటో గురించి జరిగిన రాద్ధాంతం మర్చిపోతానేవిటి” అంటూ మూతి మూడువంకరలు తిప్పిందివదిన.

"అతనికి తెలీకపోతే సుశీలకేనా వుండొద్దూ" అంది అక్కయ్య అక్కసుగా - అప్పుడు అమ్మ వుండబట్టలేక-

"చాల్లేవే - అతను రమ్మంటే అదేం చేస్తుంది కొత్త పెళ్ళికూతురు -, అప్పుడే అవునంటే కాదని ఎలా ఎదిరిస్తుంది-" అని కాస్సేపాగి-

"అయినా అందులో తప్పేముంది ? అవకాశం వుంది. వెళ్ళారు" అంది వోరకంట వదిన్ని చూస్తూ.

ఇవన్నీ అప్పుడే యింట్లో అడుగుపెట్టి, తలుపు చాటు నుండి విన్న తను ఎంత బాధపడింది ? కన్నతల్లి కన్నతల్లే అనుకుంది.

మౌనంగా ఆ ఫోటో పక్కన వున్న మరో ఫోటో మీదకి చూపులు పరుగెట్టాయి. సుశీల సిగ్గుపడిపోయింది. పదేళ్ళక్రితం, పసిడిరెక్కలు విచ్చుకుని పరుగులెత్తే కోర్కెలు తల్చుకుంటే సిగ్గుగా, చిన్నతనంగా అనిపించింది. చిన్ననాటి చేష్టలకి హేళనగా, ఏదోలా అనిపించింది.

భర్త జగన్మోహనరావు స్కూటరు మీద కూర్చుని యిటు చూస్తున్నాడు. తను వెనుక కూర్చుంది. వెడల్పు అంచు నాగపూర్ సిల్కుచీర మడత చెరగకుండా, అంచు కనబడేలా పెట్టుకుంది. జడలో మల్లెపూవులు ముందుకు కనబడేలా జార్చింది....తీక్షణంగా ఆ ఫోటోలో తన బొమ్మవంక చూస్తే సుశీలకి నవ్వు వచ్చింది. ఆ నాటి తనలో ఏదో

తెరదనం -, బిగుసుకు పోయినట్లు తను కూర్చున్న తీరు ఆమెకి చిత్రంగా అనిపించింది. స్కూటర్ మీద కూర్చున్న దర్జా ఎక్కడా కనిపించటంలేదు. అవును ఎలా కనిపిస్తుంది ? అది ఎక్కడి నుంచి వస్తుంది ?

కిరణ్ బట్టలేసుకుని కోపంగా. "అమ్మా నే వెళుతున్నా" అంటూ విసురుగా పుస్తకాలు తీసుకుంది.

సుశీల ఉలిక్కిపడింది. వెంటనే తేరుకుంది. కిరణ్ పసి హృదయాన్ని కలచివేసిన ఆ ఫోటో చూస్తే బాధగా అనిపించింది బుజ్జగింపుగా.

"అదేవిటమ్మా కిరణ్! అన్నం పెడతాను వుండు" అంది.

"నాకేం అక్కర్లేదు నువ్వే తిను కూర్చుని" అంటూ ఏడుపు ముఖంతో పరుగుపెట్టింది. ఆ పిల్ల అకారణ కోపానికి సుశీల మనసు ఎంతో బాధపడింది. అవమానంతో కృంగిపోయింది. అర్థం చేసుకునే వయస్సూ లేదు కిరణ్‌కి, అలా అని చెప్తే వినే మనసూ కాదు. విజాన్ని ఎలా చెప్పాలో, చెప్పి పిల్లలముందు నవ్వులపాలైతే ఎలా తట్టుకోవాలో సుశీల కరంకాలేదు.

జగన్మోహనరావుకి అన్నం పెడుతూ విషయం అంతా చెప్పింది. అతను నవ్వాడు "చెప్పేయకపోయావా" అన్నాడు.

"ఎలా చెప్పనండీ ? నాకెంతో సిగ్గుగా, చిన్నతనంగా అనిపిస్తోంది. పిచ్చి పిల్ల అన్నం తినకుండా వెళ్ళిపోయింది. అయినా దానికి మరీ మొండితనం. అది అడిగిందానికి సమాధానం చెప్పకపోతే ఒకటే గొడవ - ఏదో ఒకటి చెప్పినా నమ్మదు. వినదు" సుశీల గొంతులో కోపం కదిలింది. అదే సమయంలో బాధతో కళ్ళల్లో నీటిపొర ఏర్పడింది.

"ఊ....చాల్లే, మజ్జిగపొయ్యి. మధ్యాహ్నం వచ్చి అదే తింటుంది" అన్నాడు జగన్మోహనరావు.

సుశీల పని పూర్తి చేసుకుని కిరణ్ కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఆ పిల్ల వచ్చి నాలుగు మెతుకులు తింటే గాని, ఆ తల్లి మనసు కుదుటపడదు. పేపరు అటూ ఇటూ తిరగేస్తోంది. ఆమెకళ్ళు ఒకచోట క్షణం ఆగిపోయాయి. మనసులో తళుక్కున ఒకవూహ మెరిసింది.

o o o

రంగు రంగుల దీపాలతో ఎగ్జిబిషన్ కలకల్లాడి పోతోంది. రకరకాల పాటలు వినిపిస్తున్నాయి. రంగుల రాట్నం, ఆకాశాన్ని భూమిని కలుపుతూ జెయింట్‌వీల్ - పిల్లల్ని పెద్దల్ని ఎక్కించుకొని మొత్తం ఎగ్జిబిషనంతా పది నిముషాల్లో తిప్పేసే రైలు. కిరణ్, మురళి కేరింతలు కొడుతూ చూస్తున్నారు. గాజులు. లోలాకులు పూసల దండలూ అంటూ కిరణ్ గొడవచేస్తే,

కీ యిచ్చే కారు, రబ్బరుబంతి, పీచు మిఠాయి, చెరకు రసం, ఆనపకాయ బుడగ—ఒకటేమిటి. ఎటూ తోచకుండా గొడవ చేస్తున్నాడు మురళి.

"ఒక్క రూపాయితో ముచ్చటైన మీ ఫోటోను పొందండి" అని చూసి కిరణ్ గోల మొదలు పెట్టింది. పిల్లల గొడవ భరించలేక భార్యాభర్తలు అందులో అడుగుపెట్టారు. గతస్మృతులు ఇద్దరి మనసుల్నీ ఈగల్లా ముసురుతున్నాయి.

మామగారు బకాయిపెట్టిన కట్నం యిస్తే స్కూటరు కొనుక్కుందామనుకున్న ఆశ, దూరాన ఆకాశ తారగా అలాగే నిలిచిపోయింది. బకాయికట్నంమాట భగవంతుడికి తెలుసు—గంపెడు సంసారంవదిలి ఆయనే వెళ్ళిపోయాడు. తను స్కూటరు కొనుక్కోలేక పోయాడు గాని కొన్ని మధుర క్షణాల్ని ఫ్రేములో బిగించిన ఫోటో మిగిలిపోయింది. జగన్మోహనరావు క్షణం గతంలో విహరించి వచ్చాడు.

పదేళ్ళనాడు యిలాంటి ఎగ్జిబిషన్‌లోనే తనూ, ఆయనా.... నవ్వుకుంది సుశీల.

మనిషి తనచుట్టూ సృష్టించుకునే వాతావరణంఊహ. ఆ ఊహల రంగుల వలలో తను మాత్రం నిజం....

ఆమె మనసులో సిగ్గుగా, చిన్నతనంగా అనిపించింది.

కిరణ్, మురళీ అర్ధచంద్రుడిలో ఆకొస నొకరు ఈకొస నొకరు కూర్చున్నారు. చుట్టూ మిలమిలా మెరిసేనక్షత్రాలు నీలి నీలి మేఘ మాలికలు కెమెరా క్లిక్ మంది. గంటలో కడిగి యిచ్చేసిన ఫోటోనిచూసి మురిసిపోతూ యిల్లుచేరారు పిల్లలు.

మంచంమీద మధ్యగా ఆ ఫోటో పెట్టి అక్కా-తమ్ముళ్ళు వివిధ భంగిమలలో దాన్ని చూస్తుంటే వెనకగా వచ్చిన సుశీల వారి ఆనందం చూసి ముచ్చట పడింది.

ఇద్దరిమీదా రెండు చేతులువేసి మధ్యలోంచి తనూ ఫోటోని చూస్తూ...

"కిరణ్! మీ చంద్రుడెక్కడున్నాడే? ఆ చుక్కలెన్ని వున్నాయో చెప్పు చూద్దాం?" అంది.

"అయ్యో, అది నిజం చందమామ కాదూ, ఉత్తినే ఫోటో కోసం పెట్టిన అట్ట చందమామ" అంది కిరన్ దీర్ఘం తీస్తూ.

"ఓస్, అమ్మకేం తెలియదు." అంటూ చప్పట్లు కొట్టాడు మురళి.

పసిపిల్లలు కనుక నోరువిప్పి చెప్తున్నారు. అదే విషయం తామెలా చెప్పుకోగలం-అని నిట్టూర్చింది సుశీల.

( "స్వాతి" మాసపత్రిక నుండి )